క్లుప్తంగా

కార్యకర్తలకు అండగా బీఆర్ఎస్



చెక్కు ఇస్తున్న మాజీ ఎమ్మెల్యే సతీశ్‌కుమార్

చిగురుమామిడి: కార్యకర్తలకు బీఆర్ఎస్ అండగా ఉంటుందని మాజీ ఎమ్మెల్యే వొడితెల సతీశ్ కుమార్ అన్నారు. హుస్నాబాద్‌లోని పార్టీ కార్యాలయంలో మంగళవారం మండలంలోని నవాబుపేట్‌కు చెందిన బోయిని మనోజ్‌కుమార్ తండ్రి ఇటీవల మరణించగా రూ. రెండు లక్షల బీమా చెక్కును అందించారు. పార్టీ ఓడినంత మాత్రాన కుంగిపోవాల్సిన అవసరం లేదని, రాబోయే రోజులు మనవేనని, ప్రజల పక్షాన బీఆర్ఎస్ పోరాటం చేస్తుందన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండలశాఖ అధ్యక్షుడు మామిడి అంజయ్య, జిల్లా నాయకులు కొత్త శ్రీనివాస్‌రెడ్డి, సింగిల్‌విండో చైర్మన్ జంగ వెంకటరమణారెడ్డి, మాజీ మండలశాఖ అధ్యక్షుడు రామోజు కృష్ణమాచారి, నాయకులు పెనుకుల తిరుపతి, పిల్లి వేణు, శరంబందర్ రెడ్డి, పలువురు పాల్గొన్నారు.

అనుమతి లేకుండా మట్టి తరలింపు

శంకరపట్నం: మండలంలోని కొత్తగట్టు శివారులో పెట్రోల్‌బంక్‌కు అనుమతి లేకుండా అక్రమంగా మట్టి తరలించారు. ఫ్లై ఓవర్ నిర్మాణంతో పెట్రోల్‌బంక్ పోతుండటంతో వెనుక భాగంలో మళ్లీ పెట్రోల్ బంక్ నిర్మాణానికి సదరు యజమాని ఏర్పాట్లు చేస్తున్నాడు. కొత్తగట్టు గ్రామానికి చెందిన జేసీబీతో టిప్పర్ల ద్వారా మట్టిని పెట్రోల్ బంక్‌కు తరలించారు. రెవెన్యూ అధికారుల అనుమతి లేకుండా, నిబంధనలకు విరుద్ధంగా మట్టి తరలిస్తున్నారని గ్రామస్తులు ఆరోపించారు. మట్టి తరలింపు విషయమై తహసీల్దార్‌ను వివరణ కోరగా మట్టి తరలింపులో ఎలాంటి అనుమతి తీసుకోలేదని, విచారణ చేస్తామన్నారు. మట్టి తరలింపు విచారణకు వచ్చిన అధికారి రూ.యాభై వేలు తీసుకున్నట్లు గ్రామస్తులు బాహాటంగానే చర్చించుకుంటున్నారు.

చిగురుమామిడి పాల సంఘం అధ్యక్షుడిగా శ్రీధర్‌రెడ్డి



అధ్యక్షుడు, డైరెక్టర్లతో పాల శీతలీకరణ కేంద్రం చైర్మన్ నాగయ్య

చిగురుమామిడి: చిగురుమామిడి పాల ఉత్పత్తిదారుల సహకార సంఘం అధ్యక్షుడు, ముగ్గురు డైరెక్టర్లను మంగళవారం ఎన్నుకున్నారు. సంఘం కార్యాలయం ఆవరణలో నిర్వహించిన సమావేశానికి హుస్నాబాద్ పాల శీతలీకరణ కేంద్రం చైర్మన్ చింతపూల నాగయ్య ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. అధ్యక్షుడిగా పన్యాల శ్రీధర్‌రెడ్డిని సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. 13వ సారి అధ్యక్షుడిగా ఎన్నిక కావడం పట్ల డైరెక్టర్లు, రైతులు హర్షం వ్యక్తం చేశారు. డైరెక్టర్లు గా చొప్పదండి సుధాకర్, పోతరవేణి అనిల్, పోలోజు రజిత ఎన్నికయ్యారని నాగయ్య తెలిపారు. ఈకార్యక్రమంలో రూట్ సూపర్‌వైజర్లు అప్పల మల్లయ్య, సీత రవి, గత డైరెక్టర్లు పెనుకుల సంపత్, స్వప్న, పొన్నం బాలయ్య, పాన్యల వెంకట్‌రెడ్డి, మల్లం కుమారస్వామి, కాషవేణి ఓదెలు, కార్యదర్శి శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఉపాధి కూలీలకు డబ్బులు చెల్లించాలి



కూలీలతో మాట్లాడుతున్న వడ్ల రాజు

శంకరపట్నం: రెండు నెలలుగా ఉపాధిహామీ కూలీలకు డబ్బులు అందడంలేదని వ్యవసాయకార్మిక సంఘం జిల్లా ప్రధానకార్యదర్శి వడ్ల రాజు ఆరోపించారు. మండలంలోని కన్నాపూర్, రాజాపూర్ గ్రామాల్లో మంగళవారం కూలీలతో మాట్లాడారు. పెరిగిన ధరలకు అనుగుణంగా రోజుకు రూ.600 చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో ఎల్లమ్మ, ప్రభాకర్, స్వామి, మైసయ్య, మల్లేశం, సంపత్, తదితరులు పాల్గొన్నారు.

క్వింటాల్ పత్తి ధర రూ.7,350

జమ్మికుంట: జమ్మికుంట వ్యవసాయ పత్తి మార్కెట్‌లో క్వింటాల్ పత్తి ధర గరిష్ఠంగా రూ.7,350 పలికింది. మంగళవారం మార్కెట్‌కు 10వాహనాల్లో 167 క్వింటాళ్ల పత్తిని రైతులు అమ్మకానికి తీసుకొచ్చారు. క్వింటాల్‌కు మోడల్ ధర రూ.7,300, కనిష్ఠ ధర రూ.6,900కు ప్రైవేటు వ్యాపారులు కొనుగోలు చేశారు. క్రయ విక్రయాలను కార్యదర్శి గుగులోతు రెడ్డి నాయక్ పర్యవేక్షించారు.

అవకాశాలను అందిపుచ్చుకోవాలి

- పోటీ ప్రపంచంలో భవిష్యత్‌కు బంగారు బాటలు వేసుకోవాలి
- జాబ్‌మేళా ప్రారంభంలో కలెక్టర్ పమేలా సత్పతి
- ఎన్నికల్లో ఇచ్చిన హామీలు నిలబెట్టుకుంటున్నాం
- ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ సతీమణి అనురాధ



నియామకపత్రాలు అందిస్తున్న కలెక్టర్ పమేలా సత్పతి, కవ్వంపల్లి అనురాధ

తిమ్మాపూర్: పోటీ ప్రపంచంలో గెలిచి నిలవడానికి అవకాశాలను అందిపుచ్చుకుంటూ అదనపు స్కిల్స్‌తో ముందుండాలని కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. తిమ్మాపూర్ మండలం కొత్తపల్లిలోని ఓ ప్రైవేటు ఫంక్షన్‌హాల్‌లో మంగళవారం మానకొండూర్ నియోజకవర్గస్థాయి జాబ్‌మేళా నిర్వహించారు. ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వ యువజన సర్వీసులశాఖ సౌజన్యంతో నిర్వహించిన జాబ్‌మేళాను కలెక్టర్‌తోపాటు ఎమ్మెల్యే సతీమణి కవ్వంపల్లి అనురాధ ప్రారంభించారు.

అనివార్య కారణాలతో హాజరుకాని ఎమ్మెల్యే

జాబ్‌మేళాను ఉద్దేశించి డా.కవ్వంపల్లి అనురాధ మాట్లాడారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు జాబ్‌మేళా నిర్వహించామన్నారు. అనంతరం జాబ్‌మేళాకు హాజరైన యువతకు శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్యే హాజరుకావాల్సి ఉన్నా కొన్ని అనివార్య కారణాలవల్ల రాలేకపోయారని, వారి తరపున కార్యక్రమానికి వచ్చానన్నారు. ఉద్యోగం పురుష లక్షణమని ఒకప్పుడు అనేవారు కానీ ఇప్పుడు ఉద్యోగం స్త్రీ లక్షణమంటూ పురుషులతో సమానంగా పోటీపడుతూ వారి కన్నా ఉన్నత ఉద్యోగాల్లో పెద్ద ప్యాకేజీలు పొందుతున్న మహిళలున్నారని అన్నారు. ప్రస్తుతం ప్రతి ఒక్కరికి ఉద్యోగం అవసరమని, ఉన్నత చదువులు చదివినా ఉద్యోగాలు పొందలేకపోతున్నారు వచ్చిన అవకాశాన్ని వినియోగించుకొని చిన్నా పెద్ద అనే తేడా లేకుండా వచ్చిన ఉద్యోగంలో చేరాలని సూచించారు. అవకాశాలను వినియోగించుకుంటూ భవిష్యత్‌లో ఉన్నత స్థాయికి చేరుకోవాలన్నారు.

అనూహ్య స్పందన..

రాష్ట్ర ప్రభుత్వ యువజన సర్వీసులశాఖ ఆధ్వర్యంలో సోమవారం హుస్నాబాద్ నియోజకవర్గంలో మెగా జాబ్‌మేళా నిర్వహించినట్లు కలెక్టర్ తెలిపారు. చాలా మంది యువత పాల్గొని ఉద్యోగాలు పొందారని, మానకొండూరు నియోజకవర్గంలో కూడా పెద్ద ఎత్తున యువత పాల్గొని ఉద్యోగాలు పొందుతారని ఆశిస్తున్నానని, వచ్చిన ఉద్యోగం చేస్తూ ముందుకుసాగాలని సూచించారు. జాబ్‌మేళాతో ఎంతోమంది గ్రామీణ ప్రాంత నిరుద్యోగ యువత ఉద్యోగాలు సాధిస్తారని, పలు కంపెనీల్లోని ఉద్యోగాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. చాలా మంది యువత దళారులతో మోసపోతున్నారని, ప్రభుత్వ ఉద్యోగం డబ్బుల ద్వారా రాదని తెలిపారు. ప్రస్తుతం యువత ఉద్యోగాలు లేక గంజాయి, డ్రగ్స్ వంటి చెడు అలవాట్లకు బానిసై జీవితాలు నాశనం చేసుకుంటున్నారని వాటికి దూరంగా ఉండాలని కోరారు. అరవైకి పైగా కంపెనీల్లో అర్హతకు తగ్గ ఉద్యోగాలు ఉన్నాయని వచ్చినవారు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మోరపల్లి రమణారెడ్డి ప్రజాప్రతినిధులు, అధికారులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



జాబ్ మేళాకు హాజరైన నిరుద్యోగులు



ఎంపిక పత్రాలతో అభ్యర్థులు

క్షేమంగా ఉన్నా..

- గుండెపోటు వదంతులు నమ్మొద్దు
- వీడియో రిలీజ్ చేసిన ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ

తిమ్మాపూర్: మానకొండూరు ఎమ్మెల్యే, జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ స్వల్ప అస్వస్థతకు గురయ్యారు. దీంతో కొందరు ఎమ్మెల్యేకు గుండెపోటు వచ్చిందని ప్రచారం చేశారు. తిమ్మాపూర్ మండలంలో మంగళవారం నిర్వహించిన జాబ్‌మేళాకు రాకపోవడానికి గుండెపోటే కారణమని పుకార్లు షికార్లు చేశాయి. స్వల్ప అస్వస్థత కారణంగా వైద్యుల సూచనమేరకు విశ్రాంతి తీసుకుంటున్నానని, సంపూర్ణ ఆరోగ్యంగా ఉన్నానని ఎమ్మెల్యే ఓ వీడియో రిలీజ్ చేశారు. బుధవారం మధ్యాహ్నం ఎల్ఎండీ కాలనీలోని క్యాంపు ఆఫీస్‌కు వస్తున్నానని తెలిపారు. వదంతులు నమ్మొద్దని సూచించారు.

చొప్పదండి ఎమ్మెల్యేను పరామర్శించిన రాజేందర్‌రావు

చొప్పదండి: కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ పార్లమెంట్ ఇన్‌చార్జి వెలిచాల రాజేందర్‌రావు మంగళవారం ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంను పరామర్శించారు. ఎమ్మెల్యే సతీమణి రూపాదేవి ఇటీవల హైదరాబాద్‌లో మృతి చెందగా ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. వెంట కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.


ఉత్తమ ఫలితాల సాధనకు కృషి చేయాలి

- డీఈఓ జనార్దన్‌రావు

చిగురుమామిడి: ప్రభుత్వ పాఠశాలల్లోని పదోతరగతి విద్యార్థులను ఉపాధ్యాయులు దత్తత తీసుకుని విద్యాబోధన చేస్తే పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించే అవకాశం ఉందని జిల్లా విద్యాధికారి జనార్దన్‌రావు తెలిపారు. మంగళవారం మండలంలోని నవాబుపేట్ జెడ్పీహెచ్ఎస్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. పదో తరగతి విద్యార్థులతో మాట్లాడారు. విద్యార్థులు తెలుగు, హిందీ, ఇంగ్లిష్ భాషల్లో పట్టుసాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని, పిల్లలు పాఠశాలకు క్రమం తప్పకుండా హాజరయ్యేలా చూడాలన్నారు. వెంట ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ బృందం ఉన్నారు.

బడీడు పిల్లలను పాఠశాలల్లో చేర్పించండి

జమ్మికుంట: మున్సిపల్ పరిధి కొత్తపల్లిలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు బడీడు పిల్లలను పాఠశాలల్లో చేర్పించాలని మంగళవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలలో వసతులు, విద్యా విధానం, ఇతర వివరాలను పిల్లల తల్లితండ్రులకు వివరించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు జరీనా అంజుమా, ఉపాధ్యాయులు రాజేందర్, ఐలయ్య, స్వామి, శ్రీలత పాల్గొన్నారు.





విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈఓ జనార్దన్‌రావు, తల్లితండ్రులకు అవగాహన కల్పిస్తున్న టీచర్లు

జాబ్‌మేళాలతో నిరుద్యోగముండదు

- జెడ్పీటీసీ గీకురు రవీందర్

చిగురుమామిడి: హుస్నాబాద్‌లో 24న నిర్వహించిన మెగా జాబ్‌మేళాకు అధిక సంఖ్యలో నిరోద్యుగలు హాజరై విజయవంతం చేయడం సంతోషించదగిన విషయమని జెడ్పీటీసీ గీకురు రవీందర్ అన్నారు. మంగళవారం చిగురుమామిడిలో మాట్లాడారు. రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ కృషితో నిర్వహించిన జాబ్ మేళాకు 8,795 మంది హాజరు కాగా 1310 మందికి తక్షణమే ఎంపిక ధృవపత్రాలు ఇచ్చారని, ఇలాంటి జాబ్ మేళాలు సంవత్సరంలో రెండుసార్లు నిర్వహిస్తే నిరుద్యోగ సమస్య ఉండదన్నారు. సమావేశంలో డీసీసీ ప్రధానకార్యదర్శి చిటుమల్ల రవీందర్, నాయకులు బుర్ర శ్రీనివాస్, గట్టు ప్రశాంత్, నర్సింహారెడ్డి, రమేశ్, సోషల్ మీడియా ఇన్‌చార్జి ఆంజనేయులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జెడ్పీటీసీ గీకురు రవీందర్

ఎన్ఎస్‌యూఐ నాయకుల నిరసన

జమ్మికుంట: నీట్ పేపర్ లీకేజీపై సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ చేపట్టాలని ఎన్ఎస్‌యూఐ కరీంనగర్ జిల్లా ఉపాధ్యక్షుడు ఎండీ ఇమ్రాన్ డిమాండ్ చేశారు. మంగళవారం పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో కేంద్ర ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ ప్రధాని మోదీ దిష్టి బొమ్మ దహనం చేశారు. విద్యార్థుల జీవితాలతో కేంద్ర ప్రభుత్వం ఆడుకుంటుందని, పేపర్ లీకేజీ జరిగి నెల రోజులు గడుస్తున్నా కేంద్ర ప్రభుత్వం, ఎన్‌టీఏ స్పందించడం లేదని, పరీక్షను సమర్థవంతంగా నిర్వహించలేని కేంద్ర విద్యాశాఖ మంత్రిని బర్తరఫ్ చేయాలలన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్‌యూఐ జిల్లా కార్యదర్శి పల్నాటి అభిలాశ్, మండల అధ్యక్షుడు అవినాశ్, నాయకులు నాగరాజు, శివ, సమీర్, అజయ్ తదితరులు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న ఎన్ఎస్‌యూఐ నాయకులు

విద్యుత్ సబ్‌స్టేషన్‌ను పరిశీలించిన అధికారులు

మానకొండూర్: మండలంలోని గట్టుదుద్దెనపల్లి 33/11కేవీ విద్యుత్ సబ్ స్టేషన్‌ను విద్యుత్ ఉన్నతాధికారులు, ఎలక్ట్రిసిటీ సివిల్ ఈఈ శ్రీనివాస్, కన్‌స్ట్రక్షన్ ఏడీఈ అంజయ్య, నేషనల్ హైవే ఏడీఈలు, డీఈలు, డీబీఎం కంపెనీ ప్రతినిధులు పరిశీలించారు. నేషనల్ హైవే 563 నిర్మాణంలో భాగంగా గట్టుదుద్దెనపల్లి విద్యుత్ సబ్‌స్టేషన్‌కు సంబంధించి కొంత భూమి కోల్పోతున్న విషయం తెలిసిందే. స్థలం ఎంత పోతుంది, రహదారి నిర్మాణంతో సబ్‌స్టేషన్‌కు భవిష్యత్‌లో ముప్పు ఉందా అలాగే విద్యుత్ లైన్ల క్రాస్ చేయడం, సబ్‌స్టేషన్ ఉన్న స్థలం, మళ్లీ సబ్‌స్టేషన్ నిర్మాణం చేపట్టాల్సిన అవసరం వస్తే సరిపడా స్థలం ఉందా అని పరిశీలించారు. సబ్ స్టేషన్‌కు సంబంధించిన విషయాలను చెంజర్ల విద్యుత్ సబ్‌స్టేషన్ ఏఈ రమేశ్‌ను అడిగి తెలుసుకున్నారు.

ఆర్థిక సాయం అందజేత

చొప్పదండి: మండలంలోని గుమ్లాపూర్‌కు చెందిన రైతు సందెవేని కొమురయ్య ఇటీవల మృతిచెందాడు. చొప్పదండి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ద్వారా మంజూరైన రూ.పదివేలు మంగళవారం చైర్మన్ వెల్మ మల్లారెడ్డి మృతుడి కుటుంబానికి అందించారు. సభ్యులు ఎవరైనా మృతిచెందితే సంఘం ద్వారా ఆర్థిక సాయం చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ బత్తుల లక్ష్మీనారాయణ, సీఈవో క్లెం తిరుపతిరెడ్డి, డైరెక్టర్ తిరుపతిరెడ్డి పాల్గొన్నారు.

పరామర్శ..

ఇల్లందకుంట: మండలంలోని మల్యాల గ్రామానికి చెందిన బొమ్మ తిరుపతి ఇటీవల ప్రమాదవశాత్తు తాటిచెట్టు పైనుంచి పడగా తీవ్ర గాయాలయ్యాయి. మంగళవారం సర్వాయిపాపన్న మోకుదెబ్బ గౌడ సంక్షేమ సంఘం మండల అధ్యక్షుడు తోడేటి జితేందర్ ఆధ్వర్యంలో రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ పల్లెర్ల కొమురయ్య గౌడ్ తిరుపతిని పరామర్శించారు. వెంట మండల యూత్ అధ్యక్షుడు తోడేటి అనిల్‌గౌడ్, రావుల రాజేశం, గ్రామ గౌడ సంఘం అధ్యక్షుడు ఆరెల్లి తిరుపతి, బొమ్మ నర్సయ్య, సమ్మయ్య, సాయివికాస్ పాల్గొన్నారు.

స్పోర్ట్స్ స్కూల్‌లో ప్రవేశానికి ఎంపిక పోటీలు



పోటీలను ప్రారంభిస్తున్న ఎంపీపీ రవీందర్



జమ్మికుంటలో...

చొప్పదండి: ప్రభుత్వ స్పోర్ట్స్ స్కూళ్లను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ చిలుక రవీందర్ కోరారు. పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో స్పోర్ట్స్ స్కూళ్లలో ప్రవేశానికి నిర్వహించిన పోటీలను మంగళవారం ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీవో వేణుకుమార్, మున్సిపల్ కమిషనర్ నాగరాజు, హెచ్ఎం వైద్యుల రాజిరెడ్డి, కార్యదర్శి కె. క్రిష్ణ, చంద్రశేఖర్, రాజ్‌కుమార్, స్నేహలత, స్వప్న పాల్గొన్నారు.

ఇల్లందకుంట: విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలని మండల విద్యాధికారి విడపు శ్రీనివాస్ అన్నారు. మండలకేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాలలో మండలస్థాయి స్పోర్ట్స్ స్కూల్ సెలక్షన్ పోటీలు నిర్వహించారు. వివిధ పాఠశాలల నుంచి వచ్చిన విద్యార్థులు నాలుగో తరగతిలో ప్రవేశానికి పోటీల్లో పాల్గొన్నారు. ఎంపికైతే మంచి భవిష్యత్ ఉంటుందని విద్యార్థులకు సూచించారు. హెచ్ఎం జి.సాంబయ్య, టీచర్లు సంపత్ ,వీరస్వామి, మండల క్రీడల కో కన్వీనర్ సత్యనారాయణ, ఫిజికల్ డైరెక్టర్లు ఉమాదేవి, రాజు పాల్గొన్నారు.

జమ్మికుంట: పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల మైదానంలో ఎంపిక పోటీలను ఎంఈవో విడపు శ్రీనివాస్ మంగళవారం ప్రారంభించారు. బుధవారం పోటీలు ఉంటాయని ఆసక్తి గల విద్యార్థులు ధ్రువీకరణ పత్రాలతో కన్వీనర్ శ్రీలత, ఫిజికల్ డైరెక్టర్ ప్రేమలతను సంప్రదించాలన్నారు. హెచ్ఎం ఆకుల సదానందం, ప్రథమిక పాఠశాల హెచ్ఎం సారంగం, ఉపాధ్యాయులు కరుణాకర్, శ్రీనివాస్, రేణుక పాల్గొన్నారు.

గంగాధర: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించారు. పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక చేశామని ఎంఈవో వేణుకుమార్ పేర్కొన్నారు.

ముగిసిన పోటీలు

హుజూరాబాద్‌రూరల్: పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానంలో నిర్వహించిన పోటీలు మంగళవారంతో ముగిసినట్లు హుజూరాబాద్ మండల విద్యాధికారి కేతిరి వెంకట నరసింహారెడ్డి తెలిపారు. పోటీల్లో ఎంపికైన బాలబాలికలు 27న జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ స్టేడియంలో జరిగే పోటీల్లో పాల్గొంటారని సూచించారు. పీడీ, పీఈటీలను శాలువాలతో సత్కరించారు. ఎస్జీఎఫ్ కార్యదర్శి పీడీ సొల్లు సారయ్య, ప్రవీణ్ కుమార్, చిరుత శ్రీనివాస్, రేణుక, పీఈటీలు వేముల రవికుమార్, భాగ్యలక్ష్మి, సొల్లు అనిల్ పాల్గొన్నారు.

అంగన్‌వాడీల్లో గ్రోత్ మేళా



జంగపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో గ్రోత్ మేళా



చొప్పదండి: పిల్లల ఎత్తు చూస్తున్న టీచర్

చొప్పదండి: మండలంలోని కొలిమికుంట రెండో అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం గ్రోత్‌మేళా నిర్వహించారు. పిల్లల బరువు, ఎత్తు కొలతలు సేకరించారు. పోషకాహారం ఆవశ్యకతను వివరించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ లావణ్య, ఏఎన్ఎం లలిత, సీహెచ్‌వో ఆనంద్, సునీత, సుజాత, స్వప్న, తదితరులు పాల్గొన్నారు.

గన్నేరువరం: మండలంలోని జంగపల్లి అంగన్‌వాడీ కేంద్రంలోని పిల్లల బరువు, ఎత్తును గుర్తించారు. పోషణస్థాయి తల్లిదండ్రులకు వివరించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ అటికం రజిత, పిల్లలు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

'అక్రమాలు బయటపడతాయని అరెస్టు చేయిస్తున్నారు'

మానకొండూర్: కాంగ్రెస్ పార్టీ హుజూరాబాద్ నియోజవర్గ ఇన్‌చార్జి వొడితెల ప్రణవ్ సవాల్‌ను స్వీకరించిన హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి చెల్పూర్ హనుమాన్ టెంపుల్ వద్దకు వెళ్లేందుకు సిద్ధపడితే, పోలీసులు హౌజ్ అరెస్టు చేయడాన్ని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు ఖండించారు. మానకొండూర్‌లో మంగళవారం మాట్లాడారు. కౌశిక్‌రెడ్డికి మద్దతు తెలిపేందుకు వెళ్తుండగా పోలీసులు అడ్డుకున్నారని, కాంగ్రెస్ పార్టీ నాయకులకు దమ్ములేకపోతే సవాల్ చేయవద్దని హితవు పలికారు. ప్రశ్న వేసిన ప్రణవ్ బాబు బయట తిరుగుతున్నాడు. సవాల్ స్వీకరించిన ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డిని పోలీసులు నిర్బంధించడం అన్యాయమన్నారు. కాంగ్రెస్ నాయకుల అక్రమాలు బయట పడుతాయనే అరెస్టు చేయిస్తున్నారని సవాల్ వేసే ముందు ఆలోచించుకోవాలని సూచించారు. జెడ్పీటీసీ తాళ్లపల్లి శేఖర్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

నిరాధార ఆరోపణలు సహించం

వీణవంక: ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డిపై నిరాధార ఆరోపణలు చేస్తే సహించమని బీఆర్ఎస్ నాయకులు హెచ్చరించారు. మండల కేంద్రంలో మాట్లాడారు. సభ్యసమాజం తలదించుకునేలా కాంగ్రెస్ నాయకులు ప్రవర్తిస్తున్నారని, కౌశిక్‌రెడ్డికి సవాల్ విసిరింది కాంగ్రెస్ నాయకులే వారే ఇప్పుడు అక్కరకురాని మాటలు మాట్లాడుతున్నారని ఆరోపించారు. నిజాయితీని నిరుపించుకోవడానికి కౌశిక్‌రెడ్డి తడి బట్టలతో ప్రమాణం చేశాడని, మంత్రి పొన్నం ప్రభాకర్ నిజాయితీని నిరూపించుకోవాలంటే దేవుని సాక్షిగా ప్రమాణం చేయాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు సత్యనారాయణరావు, మాడ సాదవరెడ్డి, నీల కుమార్, ఓరెం భానుచందర్, మ్యాక సమ్మయ్య, కాసర్ల సుధాకర్, ఇల్లందకుంట ఎంపీపీ భర్త వెంకటేశ్, కమలాపూర్ మండల నాయకులు సత్యనారాయణరావు, ఇంద్రసేనరెడ్డితో పాటు పలువురు ఉన్నారు.

అభివృద్ధిపై దృష్టి సారించాలి

జమ్మికుంట: ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి, హుజూరాబాద్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి వొడితెల ప్రణవ్‌లు వ్యక్తగత ఆరోపణలు మానుకొని నియోజవర్గ అభివృద్ధిపై దృష్టి సారించాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు శీలం అశోక్ హితవు పలికారు. మంగళవారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో మాట్లాడారు. ఎన్నికల్లో బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు చేసిన వాగ్దానాలు, ఇచ్చిన హామీలు, ప్రజా సమస్యల పరిష్కారంలో విఫలమైయ్యాయని ఆరోపించారు. ప్రజలను అయోమయానికి గురి చేస్తున్నారని, ప్రజలకు ఉపయోగపడే విధంగా పద్ధతులు మార్చుకోవాలని సూచించారు. లేదంటే పోరాటాలు చేస్తామని హెచ్చరించారు.

రోడ్లు దెబ్బతినకుండా పనులు చేయండి

కరీంనగర్ కార్పొరేషన్: నగరంలోని 7వ డివిజన్ హౌసింగ్‌బోర్డుకాలనీలో చేపడుతున్న 24/7 తాగునీటి సరఫరా పనుల సందర్భంగా రోడ్లు చెడిపోకుండా చూడాలని స్థానిక కార్పొరేటర్ ఆకుల పద్మ డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక సంస్థల అదనపు కలెక్టర్, ఇన్‌చార్జి కమిషనర్ ప్రపుల్ దేశాయికి వినతి పత్రం అందజేశారు. మోడల్ కాలనీగా మారిన హౌసింగ్‌బోర్డుకాలనీలో 24/7 తాగునీటి సరఫరాకు సంబంధించిన పనులు ప్రస్తుతం కొనసాగుతున్నాయన్నారు. ఇప్పటికే వేసిన సీసీ రోడ్లను తవ్వుతున్నారని, ఫలితంగా పరిస్థితి మళ్లీ మొదటికొస్తుందని ఆందోళన చెందారు.

తరచూ అంతరాయం..

ముందుకుసాగని రిజిస్ట్రేషన్లు

గంగాధర: గంగాధర సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రేన్ల ప్రక్రియ విద్యుత్ సమస్యతో నిలిచిపోయింది. లోవోల్టేజీ సమస్యతో కంప్యూటర్లు పనిచేయక శనివారం రిజిస్ట్రేషన్లు నిలిచిపోగ ఆదివారం పిడుగుపాటుతో కార్యాలయంలోని యూపియస్ కాలిపోయింది. దీంతో రెండు రోజులుగా రిజిస్ట్రేషన్లు కావడం లేదు. స్లాట్ బుక్ చేసుకున్నవారు కార్యాలయానికి వచ్చి వెళ్తున్నారు. ప్రతి రోజు 30 నుంచి 35 వరకు రిజిస్ట్రేషన్లు కావాల్సి ఉండేది. కంప్యూటర్లు బాగు కాగానే సమాచారం ఇస్తామని డాక్యుమెంట్ రైటర్లు సూచిస్తున్నారు. తరచూ విద్యుత్ అంతరాయంతోపాటు కంప్యూటర్లు సరిగా పనిచేయక తరచూ రిజిస్ట్రేషన్లు వాయిదా పడుతున్నాయి. ఇప్పటికైనా విద్యుత్ సమస్యకు శాశ్వత పరిష్కార చర్యలు చేపట్టాలని డాక్యుమెంట్ రైటర్లు, ప్రజలు కోరుతున్నారు.



గంగాధర సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం

కాపర్ వైరు చోరీ

రామడుగు: మండలంలోని షానగర్ పరిధిలో వరద కాలువ వెంట దాదాపు 10 మంది రైతులకు చెందిన విద్యుత్ మోటార్లలోని కాపర్ వైరును సోమవారం రాత్రి గుర్తు తెలి యని వ్యక్తులు చోరీ చేశారని బాధితులు తెలిపారు. వరుస ఘటనలతో తాము ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు.